

# శేషేంద్ర ప్రజ

**ఉప్పిలి రామకృష్ణ, సింహాచలం**

*ప్రశ్న: కవిని విమర్శిస్తే పర్వాలేదుగాని, కవిత్వాన్ని విమర్శిస్తే సబబు కాదు. అలా విమర్శించడానికి కారణం ఏమిటి?*

మీ అభిప్రాయం నాకు సమంజసమని తోచదు. ఎప్పుడూ కావ్యం విమర్శకు విషయం కాగలదు గానీ, కవి కాజాలడు. కారణం, పాఠకుడు చదివేది కావ్యాన్ని గానీ కవిని కాదు. ఏది చదవబడుతుందో అదే కావ్యం. కవి చదవబడడు గనక కావ్యం కాడు. ఫలితాంశం– చదవబడేదే సాహిత్య విమర్శకు విషయం.

**స్ఫూర్తి, రామంతపూర్**

*ప్ర: మినీ కవితా ఉద్యమం రోజురోజుకూ పెరుగుతోంది. ఆ పెరుగుదలకు తగ్గట్టు అందులో సాహితీ విలువలు పెరుగుతున్నాయంటారా?*

*నేటి పరిస్థితుల్లో యువకుడిగా నన్నేం చేయమంటారు?*

జ: మినీ కవితా ఉద్యమం రోజు రోజుకూ పెరగడం తెలుగు కవితకు శుభదాయకం. ఆ నాలుగు ముక్కల్లోనే శ్రోతను చమత్కృద్ధిని చెయ్యాలనే ఆవశ్యకత తెలుగు కవికి బోధపడుతుంది. ఇది తెలుగు కవితలో ఒక బ్రహ్మాండమైన మలుపు. కవిత్వానికి పఠితలు కాదు, శ్రోతలు కావాలి అనే దినం వచ్చింది. శ్రోతలు అయిదారు పేజీల చేంతాటి కవిత్వాన్ని వినే శవాలు కారు అని రుజువవుతుంది. మినీ కవిత్వం దీన్ని సాధిస్తూవుందనే నా అభిప్రాయం. మీరనే సాహితీ విలువలు ఇందులోనే మిళితమై వున్నాయి.

నేటి పరిస్థితుల్లో యువకుడుగా మీరు వర్గ చైతన్యాన్ని పెంచుకోండి. "అరె–ఈ దేశం మకేమిచ్చింది! వంకర టింకరగా తిరిగే దేహం, బానిసత్వం మీద వ్యామోహం!" (ఆధునిక మహా భారతం). మన యువత ఈ గులామీ మనస్తత్వం నుంచి బయటపడాలి. అవకాశ వాదాన్ని ఆంధ్రదేశపు స్పిటూన్ చేయాలి.

**ఎస్.రామప్రసాద్, నెల్లూరు**

*ప్రశ్న: "కవిత్వమొక తీరని దాహం" అన్నారు తిలక్. దూరంగా వినువీధుల్లో విహరించే అందని అందమయింది కవితాకన్య శ్రీశ్రీ దృష్టిలో. మహా కవులుగా వాసిగాంచినవారికే అలావుంటే, మరి సామాన్యులకు కవిత్వం సొంతం అర్థం అయేదెలా?*

"కవిత్వమొక తీరని దాహం" అన్నది తిలక్ కాదు, శ్రీశ్రీ. మీ ప్రశ్న చేత నాకు మృచ్ఛకటిక అనే సంస్కృత నాటకంలో పాత్ర శకారుడు జ్ఞాపకం వచ్చాడు. భయపడి పారిపోతున్న కుంతి రావణుడి వశమైనట్లు, నీవు నా వశమవుతావంటాడు. మరొకచోట జమదగ్ని పుత్రుడైన భీమసేనుడు అంటాడు. హాస్యరసం కోసం ఈ సంభాషణలు కల్పించాడు నాటక కర్త– కవిత్వం ప్రజాసామాన్యానికి అర్థం కావాలనడం ఒక వినాదం; అర్థం కావాలని వాంఛించడం ఒక యుటోపి యన్ డ్రీమ్.

**జి.వి.శ్యామ్‌సుందర్, కోడుమూరు**

*ప్రశ్న: రావణుడు లంకలో సీతాదేవిని బంధించి యున్నప్పుడు ఆమెకు ఎలాంటి హానీ కలుగ లేదు. కాని అతనిని విలన్‌గా ఎందుకు సృష్టించినట్లు?*

వాల్మీకి రావణుడ్ని విలన్‌గా సృష్టించలేదు. రూపవంతుడనీ, విద్వాంసుడనీ వర్ణించాడు. "సమక్షమివ కందర్పం అపవిద్ధ శరాసనం" చెరకు విల్లు విడిచిపెట్టి ఎదుటికు వచ్చిన మన్మథుడు... "ఏషోఽహితాగ్నిః కర్మసువ అగ్ర వీర్యః వేదాంత :" అన్నాడు. రావణుడు నిత్యాగ్నిహోత్రి, వైదిక కర్మాచరణలో నిష్ఠాగరిష్ఠుడు, వేదాంత తత్వమార్గానుసారి. కనక రావణుడు సినిమా విలన్ ఎలా అవుతాడు?

**సి హెచ్.రాధాకృష్ణ, పొదిలి**

*ప్రశ్న: "సాహిత్యం" అంటే ఏమిటి? దీని పుట్టుక ఎప్పుడు? (ప్రస్తుత) సమాజంపై 'సాహిత్యం' ప్రభావం ఏమిటి?*

అది ముందు కవిత్వంగా ఉండాలి. శ్రోత వింటే చమత్కృతుడయ్యేలా ఉండాలి– ఆ పంక్తిగానీ, ఆ భాష గానీ కవిత్వంగా ఉండడం కవిత్వంలో సాధారణ విషయం. కవిత్వం ఉత్తమ కవిత్వం కావడానికి ఉత్తమ విషయం చెప్పబడాలి. ఉదాహరణ "హాయ్ ఓ సబ్జా చమన్ కెజిసె! సాయె గుల్ మె నీంద్ ఆయీహై" అరె ఆ తోట (ఎంత ఆశ్చర్యం ఆనందం) గులాబీ నీడలో దానికి నిద్ర వచ్చింది!– ఇది సాధారణ కవిత్వం. "దిల్ గయా రౌనఖే హయాత్ గయీ! గమ్ గయా సారీ కాయినాత్ గయీ"– హృదయం పోయిందా, జీవన శోభే పోయింది; బాధ పోయిందా, సమస్త సృష్టే పోయింది– ఇది వట్టి కవిత్వం కాదు, ఉత్తమ కవిత్వం. ●

# కాలమ్ దాటని కథ

బుకింగ్‌లో బాల్కనీకి రెండు టిక్కెట్లు తీసుకొని హాలులో కెళ్ళి తమ సీట్ల నెంబర్లు చూసుకొని కూర్చున్నారు సుజాత, ప్రసన్న. వాళ్ళు వచ్చిన అయిదు నిమిషాలకు వెనుక సీట్లలో అయిదుగురు మగరాయుళ్ళు వచ్చికూర్చున్నారు.



కూర్చోవడమేమిటి–వీళ్ళమీద కామెంట్స్ మొదలెట్టారు. ఆట మొదలయితే వాళ్ళే ఊర్కుంటారులే అనుకున్నారు సుజాత, ప్రసన్న. వాళ్ళు అనుకున్నట్టు ఆట మొదలవగానే కామెంట్సు తగ్గాయి కాని సుజాత వెనుక కూర్చున్నవాడు కాలితో వెనుక నుంచి తొక్కడం ప్రారంభించాడు. రెండుసార్లు వెనక్కు తిరిగి తీక్షణంగా చూసింది. అలా చూసినప్పుడు గబుక్కున తీసేసినా మరల అయిదు నిమిషాల తరువాత మామూలే.

'ఈసారి కాలుపెడితే చెప్తాను వీడిపని' అనుకుంది సుజాత. అనుకోవడమేమిటి–వెంటనే పైటకున్న పిన్నీసు తీసి చేతితో రడీగా పట్టుకుంది. వాడు యథావిధిగా మరల తొక్కడం ప్రారంభించాడు. అంతే_రడీగా వుంచుకున్న పిన్నీసుతో కస్సున కాలి మీద గుచ్చేసింది. శ్రీమద్ రమారమణ గోవిందో హరి!

—దాసరి రజనీ కృష్ణ